నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మూసాపేట: మరమ్మతుల కారణంగా కైత్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భీమ లింగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కైత్లాపూర్ మహేంద్ర అపార్ట్‌మెంట్స్, కైత్లాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు సంగీతోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శంకరమఠంలో శనివారం (నేడు) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ త్యాగరాజ పంచరత్న, శ్రీ రామదాసు నవరత్న కీర్తనల సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సాయంత్రం 5 నుంచి సంగీత విద్యార్థులతో గాత్ర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమం పుచ్చా రాజ్యలక్ష్మి, సాగి సుష్మ, డా. మృదుల కిరణ్ చావలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ఆలయ షెడ్డు పనులకు భూమిపూజ

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం ఉదయం 8.30 గంటలకు కూకట్‌పల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో షెడ్డు పనులకు భూమి పూజ చేయనున్నారు. అనంతరం అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించనున్నారు. పర్వత్‌నగర్, రామారావునగర్, పండిట్ నెహ్రూనగర్, యూసుఫ్‌నగర్‌లోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలను శ్మశాన వాటికలను పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'ఆప్టికా ఫెలో'గా ప్రొ.వేణుగోపాలరావు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావుకు అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని 'ఆప్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా'(ఆప్టికా) ఫెలో-2025 మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని విశిష్ట భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు అల్ట్రాఫాస్ట్ స్పెక్ట్రోస్కోప, నాన్ లీనియర్ ఆప్టిక్స్(ఎన్ఎల్ఓ) అధ్యయనాలు, పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులకు మూడు దశాబ్దాలకు పైగా అకడమిక్, పరిశోధనా అనుభవంతో 15 రీసెర్చ్‌లను పర్యవేక్షించారు. పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులపై ఆయన చేసిన పరిశోధనలకు గుర్తింపు లభించింది. ఆయనను హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్లు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్, ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో పేట్ బషీరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు.

'ప్రత్యేక' పాలనపై కోటి ఆశలు!

- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- గత అసంపూర్తి పనులతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- నిధుల లేమితో కొనసా... గుతున్న అభివృద్ధి పనులు
- ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలంటున్న పట్టణవాసులు

ముగిసిన 'పురపాలికల' పదవీకాలం



సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని పురపాలక సంఘాల పాలకవర్గా కాలపరిమితి ముగిసింది. చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గాలకు మొదటి రెండేళ్లు కోవిడ్-19తో సరిపోయింది. మిగిలిన మూడేళ్ల పాలనలో ఆశించిన మేర అభివృద్ధి కనిపించక ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ పరిస్థితుల్లో పురాలకు ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. వారి ప్రత్యేక పాలన పైనే పురప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

- నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లసహా తొమ్మిది మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి ఒకడగు ముందుకు రెండు అడుగులు వెనక్కులా ఉంది. పట్టణాల్లో పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధను పురపాలికలు అభివృద్ధిపై చూపకపోవటంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్ని పురపాలికల్లో చిన్న పాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తే లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో ప్రజలకు ఈతీ బాధలు తప్పటం లేదు. ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తీరు చెప్పనలవి కాదు.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలుగా ఏర్పడినా ఇక్కడి ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు.
- శివారు పట్టణాలను హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ముందుకు అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే...

పురపాలక సంఘాల్లో ఎక్కడ సమస్యలు అక్కడనే మూలుగుతున్నాయి. చెత్తాచెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అనే దీటీలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకపోయిన చెట్ల పొదలు, చెత్తాచెదారంతో పెరిగిన దోమల బాధను భరించలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో దోమలు అధికమవుతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే పలు కాలనీలు, బస్తీల్లో ఐదు నిమిషాలు కూడా బయట నిలబడలేకపోతున్నారు. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, సైడు కాలువలతో స్థానికులు దోమల బాధ భరించలేకపోతున్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే...

జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

- జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణానికి రూ. 4.5 కోట్ల చొప్పున, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల చొప్పున అప్పటి సర్కారు నిధులు మంజూరు చేసింది. ఆ నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

పన్నులు సరే.. అభివృద్ధి ఏదీ..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా పట్టించుకోక పోవటంతో అవికాస్తా అభివృద్ధికి నోచుకోలేదు.

'లక్షడప్పులు-వేయిగొంతులు' ను జయప్రదం చేయండి



అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఫిబ్రవరి 7న తలపెట్టిన 'లక్షడప్పులు-వేయిగొంతులు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మంద మధుకర్ మాదిగ, బ్యాగరి నరసింహ మాదిగ పిలుపు నిచ్చారు. డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి డప్పు చాటింపు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..సభకు డప్పుచప్పుళ్లతో కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముఖ్యపాక శ్రీనివాస్ మాదిగ, బుర్ర నరసింహ మాదిగ, బుర్రి యాదగిరి మాదిగ, గడ్డం నర్సింగ్‌రావు, మెడ్చేల్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు జగదీశ్ మాదిగ, రాజు, నర్సింహ, సాయి, నవీన్‌కుమార్, పవన్, జీవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక, పార్కు పరిశీలన



పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

మోతీనగర్: పాండురంగనగర్‌లోని శ్మశాన వాటికను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో వాచ్ మెన్ రూముపై రేకులు, బెంచీలు ఏర్పాటు చేయించాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బీఎస్‌పీ కాలనీ పార్కును సందర్శించారు. పార్కులో బెంచీలు, శ్మశానవాటికలో వాచ్‌మెన్‌రూముపై రేకులు, బెంచీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, చక్రపాణి, ఉదయ్, రాజ్‌కుమార్, శ్రీను, జోసఫ్, దేవేందర్, అధికారులు వాటర్‌వర్క్స్ డీఈ స్రవంతి, ఏఈ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం..

మోతీనగర్ ప్రధాన రోడ్డులో వెంకటేశ్ గౌడ్ ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు



పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

మూసాపేట: యువత వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు సూచించారు. కూకట్‌పల్లిలోని కుముదిని దేవీ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ర్యాగింగ్‌తో ఎంతోమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే మాదక ద్రవ్యాలను విక్రయించేందుకు కళాశాలలనే ఎంపిక చేసుకుని విద్యార్థులను చెడు మార్గాల్లో పయనించేందుకు కొన్ని అసాంఘిక శక్తులు ప్రోత్సహిస్తున్నాయన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెక్రటరీ కౌన్సిల్ మెంబర్ లలిత, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు, సబ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, నరసింహ, కూకట్‌పల్లి షీటీమ్ అధికారులు, రామ్‌దేవ్‌రావు సీఈఓ డాక్టర్ యోబు, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ పెంపు హర్షణీయం



ఇన్‌చార్జి వీసీ బాలకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై జేఎన్టీయూహెచ్ ఎంసీటీడబ్ల్యూఎంఏ, ఎన్ఈసీటీఏ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, అధ్యాపకులు సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, జేఎన్టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, అసోసియేషన్ సభ్యులు మాధవీకుమారి సైదా, రఘురామ్, వసుమతిల, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి ప్రధాన రహదారి కమాన్ నుండి అబ్దుల్ కలాం విగ్రహం వరకు రూ.75లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సంతోష్, నవీన్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, హెచ్‌ఎంటీ కాలనీ అధ్యక్షులు ,అసోసియేషన్ సభ్యులు.

'మనూ'లో మూడు రోజుల వర్క్‌షాప్

కెమెరా, లైటింగ్‌పై శిక్షణ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో కెమెరా, లైటింగ్ టెక్నిక్‌లపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు ఐఎంసీలో 'విజువల్ టు స్క్రీన్ ఏ డిజిటల్ వే' అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాల్గొనే వారు రూ.1500 రుసుము చెల్లించి ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర నిర్మాత పద్మశ్రీ ఏ.కె.బిర్, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రామ్ సహాయ్ పాల్గొంటారని ఆయన వివరించారు.

తెలంగాణ జీసీసీల కోసం ప్రపంచస్థాయి హబ్ ఏర్పాటు

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



రాయదుర్గం: తెలంగాణకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు(జీసీసీ)ల కోసం ప్రపంచ స్థాయి హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ది ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీసీసీ, సీఈఓల సమ్మిట్‌ను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిశీల విధానాలు, అత్యాధునిక స్థాయి మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో శిక్షణ పొందిన మానవశక్తి లభ్యతపై ప్రభుత్వం పూర్తి స్థాయి దృష్టి సారించిందన్నారు. యూఎస్ హైదరాబాద్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లారెన్స్ మాట్లాడుతూ అమెరికాకు హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంతో ఎంతో అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ సహా వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ శివమహేష్, ఐఎస్ఎఫ్ కన్వీనర్, చైర్మన్ జేఏచౌదరి, ఇతర సహ వ్యవస్థాపకులు ఎం సత్యేంద్ర కుమార్ అట్లూరి, శేషేంద్ర, ప్రకాశ్‌బండ్ల, మధుసూదన్‌సాయి ,లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ సీఈఓ శిరీష ఓరుగంటి, జీసీసీ ప్రతినిధులు, పలువురు సీఈఓలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ,చిరువ్యాపారులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నానక్‌రాంగూడ చిరు వ్యాపారులందరూ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో అధికారులను కలిసి మాట్లాడారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారికి జీవన భృతి లేకుండా చేయడం తగదన్నారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి చిరువ్యాపారులు, సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి స్పందిస్తూ చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ జీషాన్, నాయకులు శివసింగ్, తిరుపతి, వరలక్ష్మీ, ధీరజ్, సుమన్ శేఖర్, కిషన్, గోపాల్, శంకర్, శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



జేఎన్‌టీయూలో నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూలో తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఆదర్శ్, సన్నీ, ఇమ్మాన్యుయల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం, ఆయన పేరు మీద అవార్డు నెలకొల్పి యేటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో షణ్ముఖ, భరత్, ఆకాష్, సాత్విక్, అశ్వంత్, భాను, తేజ పాల్గొన్నారు.

రీసెర్చ్ మెథడాలజీ తరగతుల సమయాన్ని మార్చాలి



జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న రీసెర్చ్ మెథడాలజీ తరగతుల సమయాన్ని మార్చాలని ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకుడు భరత్‌కుమార్ కోరారు. ఈమేరకు శుక్రవారం రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టు టైం పీహెచ్‌డీ స్కాలర్లు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించే బదులు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు జవ్వాజి దిలీప్, నాయకులు రాహుల్ నాయక్, అనిష్ కుమార్, సోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్‌సాగర్ ప్రాంతంలో హైడ్రా అధికారుల పర్యటన

ఆక్రమణల పరిశీలన

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ ప్రాంతాన్ని హైడ్రా అధికారులు శుక్రవారం పరిశీలించారు. చెరువు స్థలాన్ని కొంతమంది అక్రమార్కులు కబ్జా చేసినట్లు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో పాటు అధికారులకు సైతం స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా టీం పద్మజ, ప్రవీణ్‌కుమార్, పద్మయ్య ఫాక్స్‌సాగర్ ప్రాంతంలో పర్యటించారు. ఫాక్స్‌సాగర్ పాత శాటిలైట్‌మ్యాప్ ఆధారంగా ఆక్రమణలు గుర్తించినట్లు వారు తెలిపారు.

ఫాక్స్‌సాగర్ చుట్టూ పరిశీలన..

ఫాక్స్‌సాగర్ చుట్టూ అధికారులు కలియతిరిగారు. ఫాక్స్‌సాగర్ చుట్టూ రోడ్లు ఎందుకు వేశారు..? రోడ్లను ఏర్పాటు చేసే క్రమంలో రోడ్డుకు ఆవలివైపున ఉన్న ఫాక్స్‌సాగర్ స్థలాలను ఎందుకు వదిలేశారు..? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫాక్స్‌సాగర్ వద్ద ఉన్న పాత హద్దులను ఎందుకు తొలగించారు..? అనే విషయాన్ని పలువురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొంపల్లివైపు ఉన్న ఉమామహేశ్వరకాలనీలో ప్రాంతంలో పర్యటించారు.

కబ్జాదారులు పరార్.. హైడ్రా అధికారులు స్థానికంగా పర్యటిస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక ఆక్రమణదారులు అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఇప్పటికే ఫాక్స్‌సాగర్ స్థలంలో కొంతమంది అక్రమ దందాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసానికి నియోజకవర్గ పరిధిలో పలు సంక్షేమ సంఘాల నాయకులు శుక్రవారం తరలివచ్చి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజా సమస్యలు పట్టడం లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ మృతి



శరత్‌బాబు (ఫైల్)

జీడిమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ హరిజనవాడకు చెందిన డప్పు శరత్‌బాబు (38) తన ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకెళ్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకుని షాపూర్ నుంచి ఐడీపీఎల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా బోల్తా పడి శరత్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తు తెలియని వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ కుమ్మరిబస్తీకి చెందిన నేమూరి శంకర్‌గౌడ్ (65) ఈనెల 26 ఇంటి నుంచి వెళ్లాడు. 2 రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు సంతోష్‌కుమార్ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో శంకర్‌గౌడ్ చింతల్ ఆర్ఎస్‌సీ హాస్పిటల్ మెయిన్ రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా షాపూర్ నుంచి బాలానగర్ వెళ్తున్న డీసీఎం వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ విషయమై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా తీవ్రంగా గాయపడ్డ శంకర్‌గౌడ్‌ను పోలీసులు 108 అంబులెన్స్‌లో గాంధీ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతిచెందాడు. కాగా మొదటగా గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు భావించారు. శంకర్‌గౌడ్‌పై అల్వాల్ పీఎస్‌లో అదృశ్యమైన కేసు ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సంతోష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ నిర్మాత వేదరాజు టింబర్ మృతి



వేదరాజు టింబర్ (ఫైల్)

మోతీనగర్: మోతీనగర్‌కు చెందిన సినీ నిర్మాత, ఎంసీహెచ్ఎస్ సీనియర్ సభ్యుడు వేదరాజు టింబర్ (54) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మోతీనగర్‌లోని ఆయన నివాసంలో టింబర్ మృతదేహాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిన్నగారి లక్ష్మారెడ్డి, ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పలువురు రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీర రాఘవరెడ్డి, ఎంసీహెచ్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావు, మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి, బిజముల్ల నాగేశ్వరరావు, మోతీనగర్‌వాసులు తదితరులు ఉన్నారు.



నివాళులర్పించిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి